క్లుప్తంగా

నేడు నల్లకుంటలో స్వచ్ఛ భారత్

నల్లకుంట: నేడు నల్లకుంటల స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఉంటుందని బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నల్లకుంట శంకరమఠం సమీపంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద ప్రారంభమై ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దీనికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ వై. అమృత హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ

నల్లకుంట: సంజీవయ్యనగర్‌లోని అంబేడ్కర్ శతాబ్ది భవన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయించిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నేడు ఉంటుందని గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్ ప్రకటించారు. ఉదయం 10.30 గంటలకు ప్రముఖ కవి, రచయిత సంగీతపు రాజలింగం విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



అంబర్‌పేట్: పరిసరాల పరిశుభ్రతపై సమాజాన్ని చైతన్య పరచాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ప్రగతి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ బాపునగర్‌లో ఆయన పాఠశాల విద్యార్థులతో కలిసి 'స్వచ్ఛత హై' సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

3న శంకరశర్మ జయంతి

నల్లకుంట: ప్రముఖ సంగీత విద్వాంసుడు, సరస్వతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు దివంగత పోపూరి శంకరశర్మ 103వ జయంతిని ఈ నెల 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం ఉపాధ్యాయులు, నల్లకుంట మ్యూజిక్ సిస్టర్స్ తేజస్విని, యశస్వినులు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా టీవీ దర్శక నిర్మాత శోభాశంకర్ హాజరవుతారని సమాచారం. ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తి, వంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాసశర్మలచే వీణా కచేరి, విద్యార్థులతో శంకరశర్మ రచనల గానం ఉంటుందన్నారు. సంగీత విద్యాలయం విద్యార్థులంతా హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

4న గుర్రం జాషువా జయంతి వేడుకలు

కాచిగూడ: సమతా సాహితి వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 4న సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలో మహాకవి, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సమతా సాహితి వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశిశ్రీ ప్రకటించారు. రాష్ట్ర ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చేతన ముఖ్య అతిథిగా, ప్రముఖ కవులు ఆచార్య శిఖామణి, డాక్టర్ కోయ కోటేశ్వరరావు, డాక్టర్ పసునూరి రవీందర్, ప్రముఖ న్యాయవాది శ్రీకాంత్ చింతల, మానవ హక్కుల కార్యకర్త విశ్వనాథ్, జయంతి తదితరులు పాల్గొంటారన్నారు.

'బద్రుక'లో ఫ్రెషర్స్ డే



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

కాచిగూడ: కాచిగూడలోని బద్రుక కళాశాల విద్యార్థులు కళాశాలలో ఫ్రెషర్స్ డే ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. శనివారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. గ్లోబల్ జనరల్ కౌన్సిల్ సుజిత్ బిన్ అలీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉందని, ఇక్కడి నుంచి వచ్చిన వారు అనేక విభాగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పూర్వ విద్యార్థి మనీష్ షాహ్, కళాశాల సెక్రెటరీ శ్రీకిషన్ భద్రుక, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జానకీరామ్, భవాని త్రిపుర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం

లాలాపేట: 'ఏక్ తారీఖ్ ఏక్ ఘంటా ఏక్ సాథ్' అనే నినాదంతో ప్రధాని పిలుపు మేరకు ఆదివారం తార్నాక చింతల్ బస్తీలోని ఫ్లై ఓవర్ వద్ద స్వచ్ఛ భారత్‌లో భాగంగా శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో స్థానికులు, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: కవాడిగూడ డివిజన్ పరిధిలోని దోమలగూడలో రూ.50లక్షలతో నిర్మిచనున్న వీడీ సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దోమలగూడ గగన్‌మహల్‌లోని కొన్ని బస్తీలలో కొద్దిపాటి వర్షానికే రోడ్లు చెరువుల్లా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించేందుకు నూతన వీడి సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, నూతన వీడీసీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. బస్తీలలో ఏ సమస్య ఉన్నా తాము పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు వెంకటేష్, ప్రభాకర్, పరిమళ్‌కుమార్, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, నాయకులు ఎస్సీసెల్ అధ్యక్షులు ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, కల్యాగోపి, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



కాచిగూడ: మోతీమార్కెట్‌లో నూతనంగా వేస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాచిగూడ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిర్లక్ష్యం చేయొద్దని అధికారులకు సూచించారు. బీజేపీ నేతలు సుభాష్ పటేల్, ఓంప్రకాష్, బీమ్‌రాజ్, సూరి, ఎస్.రవి యాదవ్, ఆర్.సంతోష్ తదితరులున్నారు.

దేశ సేవ నుంచి ప్రజా సేవకు..



మాట్లాడుతున్న స్వామిరెడ్డి తదితరులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ముందుకెళ్తున్నట్లు డేరెడ్డి స్వామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే పార్టీ అదిష్టానం చేసిన విజ్ఞప్తి మేరకు ముషీరాబాద్ బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. శనివారం జవహర్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్స్‌సర్వీస్‌మెన్ అయిన తాను ప్రస్తుతం సాయి గ్రూపునకు సీఎండీగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సెక్యురిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు చైర్మన్, ఆల్ ఇండియా సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీకి తెలంగాణ హెడ్‌గా వ్యవహరిస్తున్నానన్నారు. బీజేపీలో సభ్యత్వం కలిగిన తాను గత అనేక సంవత్సరాలుగా స్వచ్ఛంద, సేవా కార్యక్రమాలు నిర్వహించడం, మహిళలకు స్వయం సంవృద్ధి సాధించి ఆర్థిక స్వావలంబన చేకూర్చేందుకు కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ తదితర వృత్తివిద్యలో తర్ఫీదు అందించినట్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో రెండేళ్ల పాటు అనేక నిత్యవసరాలు, మందులు పంపిణీ చేశానన్నారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలతో పాటు బీజేపీ కేంద్ర నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఉన్నత విద్యావంతులైన తనను ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తారని ఆకాంక్షించారు. దేవవ్యాప్తంగా పేదలకు సెక్యూరిటీ సర్వీసులో ప్రత్యక్షం, పరోక్షంగా దాదాపు రెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ముషీరాబాద్ నియోజవర్గంలోని సీనియర్ బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులను కలిసి మద్దతు కోరామన్నారు. బీజేపీ నాయకులు టి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డిలు పాల్గొన్నారు.

క్రీడలకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్: క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో తెలంగాణ గ్రామీణ క్రికెటర్ అసోసియేషన్ బోర్డ్ మెంబర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవల్ క్రికెట్ చాంపియన్ షిప్– 2023 ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో పాటు గుప్తా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 1 వరకు జరుగుతాయని, మొత్తం 10టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు వివరించారు. క్రీడాస్ఫూర్తితో యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని తాము ఎంచుకున్న క్రీడల్లో రాణిస్తూ.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. నిర్వాహకురాలు భువనేశ్వరి, సాయి, ముచ్చకుర్తి ప్రభాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కృష్ణా(మహబూబ్‌నగర్)- కాచిగూడ మధ్య తొలి రైలు

కాచిగూడ: కృష్ణా – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య మొట్ట మొదటి రైలు సర్వీస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జెండా ఊపి ప్రారంభించనున్నారని రైల్వే అధికారులు ప్రకటించారు. కాచిగూడ – రాయచూర్ – కాచిగూడ స్టేషన్ల మధ్య దేవరకద్ర – కృష్ణా మీదుగా నూతన రైలు సర్వీస్ (డెమూ) ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కృష్ణా నుంచి కాచిగూడ రైలును ప్రధాని ప్రారంభించనున్నారని, ఈ రైలు కృష్ణా నుంచి కాచిగూడ వరకు నడుస్తుంది. దీంతో కాచిగూడ, రాయచూర్ మధ్య రోజువారీ రైలు సేవలు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, రాయచూర్ జిల్లాలను కలుపుతూ రైలు నడుస్తుందన్నారు. ఈ రైలు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ప్రజలకు రాజధాని వైపు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాన్ని అందిస్తుందన్నారు. నారాయణపేట్‌లోని చేనేత పరిశ్రమకు ఎంతగానో ఊతమిస్తుందన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం.. పాలక వర్గాల కుట్ర'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం పాలకవర్గాల కుట్ర అని బహుజన్ విముక్తి పార్టీ (బీఎంఎస్) జాతీయ అధ్యక్షులు ప్రవేంద్రప్రతాప్‌సింగ్ విమర్శించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన విముక్తి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు ప్రవేంద్రప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రైవేటు రంగాల్లో సంస్థలను స్థాపించడానికి ప్రభుత్వం అనుమతించడం సరికాదన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రొత్సహించడం పేదలకు విద్యను దూరం చేయడమేనని విమర్శించారు. విద్యతో పాటు ప్రభుత్వ వైద్యాన్ని కూడా పాలక వర్గాలు ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. జాతీయ ఉపాధ్యక్షులు రాందాస్‌నాయక్, భారత్ ముక్తిమోర్చా అధ్యక్షులు వగిలి ప్రభాకర్, అడ్వకేట్ మాధవకృష్ణారెడ్డి తదితరులున్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్‌కు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు, అలైడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సాయిబాబు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సెక్యూరిటీ గార్డులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీల చట్టం, సెంట్రల్ మోడల్ రూల్స్ 2006ను సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. అనేక ఏజెన్సీలు కార్మికులకు పీఎఫ్ చెల్లించడం లేదని, కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడి చేస్తున్నారని విమర్శించారు. మహిళా సెక్యూరిటీ గార్డులకు ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలని చట్టంలో ఉన్నా.. అమలుకు నోచుకోవడం లేదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఈశ్వర్, అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, అనురాధా, సోమన్న, దేవేందర్, శ్రవంతి, పూర్ణిమ రవికుమార్ తదితరులున్నారు.

ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

ముషీరాబాద్: రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ. వేయి కోట్ల నిధులు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్య వైశ్యులకు ఇచ్చిన హామీ ప్రకారం అక్టోబర్ 10వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వవైఖరిని ప్రకటించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర జనాభాలో 6 నుంచి 7శాతం ఉన్న ఆర్యవైశ్య సామాజిక వర్గం రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీల గెలుపు ఓటములను శాసించే స్థాయిలో ఉన్నారని ప్రభుత్వంతో పాటు వివిధ రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభ కోశాధికారి మల్లికార్జున్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రేణుకుంట్ల గణేష్‌గుప్తా, మహాసభ మీడియా సెల్ చైర్మన్ రాచమల్ల వెంకటేశ్వర్లు, చికోటి ప్రవీణ్, లక్ష్మణ్, వెంకటేష్, మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా, రామకృష్ణ, సామ్రాజ్యలక్ష్మి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద, మారుశెట్టి అనంతరాములు పెద్దఎత్తున ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే' !

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారధి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసిన తమ పార్టీనే అధికారంలోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రధాని మహబూబ్‌నగర్, 3న నిజామబాద్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల్లో వణుకుపుడుతుందన్నారు. రాష్ట్రంలో మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా వంటి బీజేపీ అగ్రనేతలు పర్యటించనున్నారని తెలిపారు.

హుండీ లెక్కింపు

ముషీరాబాద్: దోమలగూడ హనుమాన్ దేవాలయ హుండీని లెక్కించారు. గత ఆరు నెలల హుండీ ఆదాయం రూ.1,52,835లు వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖవాణి, ఆలయ ఈఓ దేవనాథం ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3గంటల వరకు అధికారుల సమక్షంలో దేవాలయ భక్తులు హుండీని లెక్కించారు. దేవస్థాన మాజీ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ ఏ–బ్లాక్ మాజీ అధ్యక్షులు కే.ఆర్.కే ప్రసాద్, కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎన్.డీ సాయికృష్ణ, మాజీ అధ్యక్షుడు ఆర్.రాంచందర్, ఆలయ మాజీ ధర్మకర్తలు సంతోష్, వేణుగోపాల్, మురళీకృష్ణ, ఆలయ అర్చకులు మహేందర్, శేషాచలం, ప్రభు, భక్తులు ప్రభాకర్, శేఖర్, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం'

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టకుండా ప్రధాని నరేంద్రమోదీ మాదిగలను మోసగించారని తెలంగాణ మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజ్ మాదిగ, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఇటికె రాజు మాదిగ ఆరోపించారు. ఆదివారం ప్రధాని పర్యటనను అడ్డుకుంటామని వారు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని బహిరంగ సభను మాదిగలు బహిష్కరించాలని వారు పిలుపునిచ్చారు.

కత్తితో దాడిచేసిన నిందితుడి రిమాండ్

కాచిగూడ: తాగిన మైకంలో ఇద్దరు వ్యక్తులపై దాడిచేసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా ప్రాంతానికి చెందిన గంగా బెహరా కుమారుడు రిపూ బెహరా (28) వృత్తిరీత్యా కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలోని వుడ్‌సైడ్ హోటల్‌లో పార్సల్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో పింటూ, నిఖిల్ మెడపై కత్తితో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

మాల భవన్‌కు ఐదెకరాల స్థలం కేటాయించాలి



బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న మాలసంఘాల జేఏసీ నాయకులు

ముషీరాబాద్: నగరంలో మాల భవన్ నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని, మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు జనరల్ స్థానాల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని మాల సంఘాల జేఏసీ నాయకులు బేరా బాలకిషన్, చెరుకు రాంచందర్, తాళ్లపల్లి రవి అన్నారు. శనివారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు నూతన చైర్మన్‌గా నియమితులైన బక్కి వెంకటయ్యను తెలంగాణ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దోమలగూడలోని మాల సంఘాల జేఏసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. మాల సంఘాలు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా దళితుల్లో సమన్యాయం పాటించి బక్కి వెంకటయ్యను కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాలసంఘాల జేఏసీ ముఖ్య సలహాదారులు రావుల అంజన్న, శివరాజ్, గడ్డం సత్యనారాయణ తదితరులున్నారు.

2593 మందికి డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

ముషీరాబాద్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో మూడో విడతల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో అర్హులైన 2593 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ జరిగిందని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి ఎమ్మెల్యే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ చేకూరేలా కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఆర్.మోజెస్, రాకేష్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు సాయికృష్ణ, రజనీకాంత్, అరుణ్‌కుమార్, సత్యనారాయణ తదితరులున్నారు.

కూలిన ప్రహరీ.. తప్పిన ప్రమాదం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని హజార్ గల్లీలో శనివారం తెలవారు జామున 1.30 నుంచి 2 గంటల మధ్య ఓ ప్రహరీ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం.. హజర్‌గల్లీలో ఖాళీ స్థలానికి ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్థలంలో శనివారం తెల్లవారు జామున 1.30–2 గంటల ప్రాంతంలో డీజే సౌండ్ బాక్స్‌లను తీసుకొచ్చిన టాటా ఏస్ వాహనంలో పెడుతుండగా ప్రమాదవశాత్తు ప్రహరీ కూలిపోయింది. ఈ గోడ పక్కనే మూడు ద్విచక్ర వాహనాలు ఉండటంతో కూలిన దిమ్మెలు వాహనాలపై పడి ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలోనే ఈ పాత గోడను తొలగించాలని జీహెచ్ఎంసీ, సంబంధిత స్థల యజమానులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు.

మహాప్రస్థానంలా హిందూ శ్మశానవాటికలు



అంబర్‌పేట్: నియోజకవర్గంలో శ్మశానవాటికలను మహాప్రస్థానంలా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం బాగ్ అంబర్‌పేట్ డివిజన్ మెయిన్ చెరువు హిందూశ్మశాన వాటికలో రూ.2.75 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. శ్మశానవాటికలో నూతన కార్యాలయ గదులు, షెడ్లులు, సీసీరోడ్లు, ప్రహరీగోడ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ దీపాలు, పార్కు వంటి అభివృద్ధి పనులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, వెంకట్‌రెడ్డి, శ్రీరాములుముదిరాజ్, చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థుల సిటీ టూర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థులు సిటీ, క్యాంపస్ టూర్ చేపట్టారు. శనివారం కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరు బస్సులకు ప్రిన్సిపల్ శ్రీరామ్ వెంకటేష్ జెండా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్‌లో భాగంగా నగరంలోని వివిధ ప్రధాన ప్రాంతాలతో పాటు ఓయూ క్యాంపస్‌లో పర్యటించనున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్‌తో పాటు ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి స్వామివారి రథోత్సవం



చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధి చెందిన లక్ష్మీగణపతి దేవాలయం రథోత్సవం నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి తిరువీధిసేవ రథోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో పేదలకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ దంపతులు పద్మ, ప్రభాకర్, మాజీ చైర్మన్ బీఎస్ శ్రీనివాస్‌యాదవ్, ఈఓ లక్ష్మారెడ్డి, సభ్యులు రమణమూర్తి, మోహన్ రావు, వెంకటగోవిందరావు, రాజా శ్రీనివాస్, హనుమంతరావు, డాక్టర్ వెంకటరమణరావు, కె.రాజు, ఎ.దశరథ, కె.సురేఖ, అరుణశ్రీ, స్వరూప, శివకుమారి, హరిత, భక్త బృందం సభ్యులు, ఆలయ అర్చకులు కాశీనాథశర్మ, గోపాలాచారి, బుచ్చమ్మచారి, భవనందశర్మ, జగన్‌మోహనాచారి, నరసింహం, రామాచారి, రాజు, రాజన్ మహిళలు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల వినూత్న నిరసన



ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో ఖాళీ పళ్లాలతో నిరసన చేస్తున్న ఆశావర్కర్లు

చిక్కడపల్లి: ఆశా వర్కర్లు ఖాళీ పళ్లాలతో వినూత్న నిరసన చేపట్టారు. గత 6 రోజులుగా తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా 29వేల మంది ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో 'ఆశా వర్కర్ల ఆకలి గోస వినండి–ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇవ్వండి' అని నినదిస్తూ.. ఖాళీ పళ్లాలను మోగిస్తూ నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశావర్కర్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే బీఆర్ఎస్ ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. పనికి తగిన పారితోషికం పేరుతో ఆశా వర్కర్లకు కేవలం రూ. 9750 ఇస్తూ.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా 3 సార్లు పారితోషకాలు రాష్ట్రంలో పెంచామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు.

- ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగేళ్ల నుంచి ఆశా వర్కర్లకు రూ.10 వేల ఫిక్స్ వేతనం ఇస్తున్నారని, తెలంగాణలో ప్రతినెలా ఏఎన్‌సీ కేసులు టార్గెట్ రీచ్ కాకపోతే ఒక సందర్భంలో కేవలం రూ.3వేల పారితోషకం మాత్రమే ఇస్తున్నారన్నారు.
- ఖమ్మం జిల్లాలో ఆశా కార్మికురాలు రోడ్డు ప్రమాదంలో మరణించినా.. ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని జయలక్ష్మి డిమాండ్ చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెపోటు వంటి రోగాల భారీన చిన్న వయస్సులోనే పడుతున్నారన్నారు.

– ఆరు నెలల పీఆర్సీ బకాయిలు, కేంద్రప్రభుత్వం చెల్లించాల్సిన 18 నెలల కరోనా రిస్క్ అలవెన్స్, వెంటనే ఇవ్వాలని ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, నాగలక్ష్మి, మహేందర్, సత్యనారాయణ, మల్లేష్, యాదమ్మ, అనిత, రాణి, బాలమణి, అనురాధ, సాధన, రజని తదితరులున్నారు.